జిమ్‌సర్‌లో యాంటీమైక్రోబియల్ అవగాహన వారోత్సవం

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) ఆధ్వర్యంలో సోమవారం యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎఎమ్ఆర్) అవగాహన వారోత్స వాలను ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వసంత కుమార్ ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 70 లక్షల మందికి పైగా జనాభా ఏఎంఆర్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన తెలిపారు. యాంటీ బయాటిక్స్‌ను అవసరానికి మించి వినియోగించడం వల్ల ఎఎమ్ఆర్ మహమారి విజృంభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా యాంటి బయాటిక్స్‌ను బాధ్యతగా ఉపయోగించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జిమ్‌సర్ ఫార్మకాలజీ విభాగం అధిపతి డాక్టర్ టి.తులసి మాధురి, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చైతన్య, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్టు కార్మికులకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలి

ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కార్మికులకు నెలకు రూ. 26 వేలు జీతం ఇవ్వాలని మెడికల్ అలవెన్స్ ఇవ్వాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గౌరవ అధ్యక్షులు జేవీ సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి జెడి నాయుడు డిమాండ్ చేశారు. నగరంలో కింగ్ జార్జి ఆసుపత్రి, ఆంధ్ర మెడికల్ కళాశాల, విక్టోరియా ఆసుపత్రి, ప్రాంతీయ కంటి ఆసుపత్రి, ఈఎన్‌టి ఆసుపత్రి, మెంటల్ కేర్ ఆసుపత్రి, రాణి చంద్రమతి దేవి ఆసుపత్రి, చెస్ట్ ఆసుపత్రి, విమ్స్‌లో వెయ్యి మంది కాంట్రాక్ట్ పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కార్మికులు 20 ఏళ్ళుగా పని చేస్తున్నారని తెలిపారు. దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన నిరుపేదలు ప్రభుత్వ ఆసుపత్రులతో వ్యర్థాలను ప్రాణాలను ఫణంగా పెట్టి తొలగిస్తున్నారని అన్నారు. రోజురోజుకీ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, ఇంటి అద్దెలు, స్కూల్ ఫీజులు పెరుగుతున్నాయని, ప్రస్తుతం ఇస్తున్న జీతం రూ. 16,000 సరిపోవడంలేదని తెలిపారు. అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని చెల్లించలేక అప్పుల పాలవుతున్నారని అన్నారు. అందువల్ల 26 వేల రూపాయలు జీతం, మెడికల్ అలవెన్స్ ఇప్పించాలని కోరారు. కేజీహెచ్‌లో ప్రదర్శన అనంతరం కలెక్టర్ ఆఫీస్ కు వెళ్లి కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.

వీధి విక్రయదారులకు రుణాలు మంజూరు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి జి.వి.ఎం.సి జోన్-1 కార్యాలయం నందు కేంద్ర ప్రభుత్వం వారు ప్రత్యేకంగా ప్రవేశ పెట్టిన పి.ఎం. స్వానిధి బి, స్వాభిమాన్ బి పక్వాడ అనే క్యాంపెయిన్ ద్వారా వీధి విక్రయదారులకు ఋణాలు మంజూరు, వారి కుటంబ సభ్యుల వివరాల సేకరణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 33 మంది లబ్దిదారులకు ఋణాలు మంజూరు చేశారు. అలాగే వీధి విక్రయదారులకు ప్రత్యేక యాప్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి.ప్రేమ ప్రసన్న వాణి, డి.లక్ష్మీ, డి.పి.ఒ కె.కనకమహాలక్ష్మీ, వార్డు కార్పోరేటర్లు, స్టేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ విద్యాసాగర్, లేబర్ డిపార్ట్మెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీ అమలు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు

విశాలాంధ్ర - పీఎంపాలెం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలకు పట్టణాలలో 2 సెంట్లు, గ్రామాలలో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్ళ నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు విజ్ఞప్తి చేశారు. శివశక్తినగర్ నుండి బొట్టావానిపాలెం 71వ నెంబర్ సచివాలయం వరకు సోమవారం ప్రదర్శన నిర్వహించి, అనంతరం వెల్ఫేర్ కార్య దర్శి రజనికి వ్యక్తిగత దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 32 లక్షలు మంది పేదలకు పట్టణాల్లో ఒక సెంటు, గ్రామాల్లో సెంటున్నర ఇళ్ళ స్థలా లు ఇచ్చి, ఒక్కొక్కరికీ ఇంటికి లక్షా 80 వేలు ఇచ్చారని, అవి సరిపోవని సీపీఐ ఆనాడే చెప్పినా ఖాతరు చేయలేదని విమర్శిం చారు. కూటమి అధికారంలోకి వస్తే పట్టణాల్లో 2, గ్రామాల్లో 3

సెంట్లు చొప్పున ఇంటి నిర్మాణం కోసం 4 లక్షలు ఇస్తామన్నారని, అందుకే కూటమిని గెలిపించారని, ఇచ్చిన హామీని అమలు చేయాలని, గత ప్రభుత్వం ఇచ్చిన లే అవుట్‌లను మార్చి రోడ్లు, విద్యుత్, తాగునీరు, కాలువలు మౌలిక సదుపాయాలు కల్పించా లని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఏరియా కార్యదర్శి వి.సత్య నారాయణ, జిల్లా సమితి సభ్యురాలు ఎండి బేగం, పార్టీ సీనియర్ నాయకుడు బి.కేశవయ్య, ఎస్‌కె సల్మా, కె.కుమార్ పాల్గొన్నారు.

పెందుర్తి: పేదలకు గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి 5 లక్షలు ఆర్థిక సాయం చేయాలని సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ 97వ వార్డు, చినముషిడి వాడ గ్రామ సచివాలయం 507 వద్ద ఇళ్లు లేని నిరుపేదలతో ఆందోళన కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంట్లు, పట్టణాల్లో 1 సెంటు చొప్పున ఇళ్లస్థలాల పట్టాలు ఇవ్వడంతో పాటు ఆయా స్థలాలు పట్టణాలకు దూరంగా నివాసయోగ్యంకాని ప్రాంతాలలో కేటాయించారని, అందులో చాలామంది పేదలకు ఇప్పటివరకు ఇళ్లస్థలాలు చూపలేదని ఆవేదన వెలిబుచ్చారు. కాకి లెక్కలతో 32 లక్షల మందికి ఇళ్లపట్టాలు యిచ్చినప్పటికీ పేదలు ఆ స్థలాల పట్ల సుముఖత చూపలేదని, పైగా ఇంటి నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సహాయం కూడా కేవలం 1.80 లక్షలు మాత్రమే ప్రకటించడంతో, ఆ ఆర్థిక సహాయంతో పునాదులు కూడా పూర్తిచేయలేమని పేదలెవ్వరూ ఇంటి నిర్మాణం చేపట్టలేదని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. అనంతరం 502, తదితర సచివాలయాలలో పేదలకు ఇళ్ళు కొరకై నింపిన అప్లికేషన్లను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు వై.రాంబాబు, పెందుర్తి ఏరియా కార్యదర్శి ఎన్.అసిరి నాయుడు, పార్టీ సభ్యులు ఎం.రాము, అరుణ, శ్రీరామ్, రమణ, విజయ, రజినీ, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కల్పించాలని పట్టణంలో రెండు సెంట్లు, గ్రామంలో మూడు సెంట్లు, స్థలాలు ఇవ్వాలని పూర్తయిన టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు వెంటనే అందించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం కొత్త గాజువాక హెచ్‌పి పెట్రోల్ బంకు వద్దనున్న సచివాలయం దగ్గర లబ్ధిదారులతో ఆందోళన నిర్వహించారు. అనంతరం సచివాలయ కార్యదర్శి సిహెచ్.మోహన్‌రావుకి లబ్ధిదారులు అర్జీలతోపాటు సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, కెంగువ అచ్యుత్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో జీవో నెంబర్ 301, 296, 44, 100 గజాల లోపు పట్టాలు పొందిన వారందరికీ రిజిస్ట్రేషన్ హక్కు, తనఖా పెట్టుకోవడానికి హక్కు కల్పిస్తూ పట్టాదారులకు ఎన్‌ఓసి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిమెంటు ఇసుక, కంకర, ఇటుక పెరిగిన ధరలకు అనుకూలంగా, కొత్తగా ఇల్లు నిర్మాణం చేసుకునే వారికి 5 లక్షల రూపాయలు రుణాలు మంజూరు చేయాలని, 2014లో టీడీపీ నిర్మించిన టిడ్కో ఇల్లు గత వైసీపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి లబ్ధిదారులకు ఇవ్వకుండా కాలయాపన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శిలు పెద్దపూడి దుర్గారావు, జిల్లా మహిళా నాయకురాలు కె.వనజాక్షి, పి.పోతన్న, కె.పద్మ, వై.దేములు, లోకేష్, శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సిపిఐ కంచరపాలెం కమిటీ ఆధ్వర్యంలో

విశాలాంధ్ర - విశాఖ: గత ప్రభుత్వం సుదూర ప్రాంతాల్లో నివాస యోగ్యం కాని స్థలాలను పేదలకు పట్టణాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర ఇచ్చిందని, ఇంటి నిర్మాణం కోసం ఇచ్చిన రూ.1.80 లక్షలు పునాదులకు కూడా సరిపోలేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పాత్రపల్లి చంద్రశేఖర్ విమర్శించారు. పేద ప్రజలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని సిపిఐ కంచరపాలెం కమిటీ ఆధ్వర్యంలో గంగానగర్ సచివాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం లబ్ధిదారులు వ్యక్తిగత అర్జీలను సచివాలయ కార్యదర్శి శోభన్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేద ప్రజలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షలు ఇస్తామని చెప్పారని, ఆ హామీకి కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని, ఇచ్చిన హామీని త్వరితగతిన అమలు చేయాలని కోరారు. ధర్మానగర్ సచివాలయంలో కూడా వ్యక్తిగత అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కంచరపాలెం శాఖ కార్యదర్శి వాసుపల్లి మల్లయ్య, సిపిఐ ఉత్తర నియోజకవర్గం నాయకులు గురుమూర్తి, సిపిఐ నాయకులు కోనేరు వేణు, రమణమ్మ, లక్ష్మి, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

25 నుండి పవిత్రోత్సవాలు

విశాలాంధ్ర - సాగర్‌నగర్: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం (టిటిడి)లో ద్వితీయ పవిత్రోత్సవాలు ఈనెల 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు నిర్వహించనున్నామని ఆలయ ఏఈఓ జగన్మో హనాచార్యులు తెలిపారు. 25వ తేది సాయంత్రం 6 గం.ల నుండి 8.30ని.ల వరకు అంకురార్పణ, 26వ తేదీ పవిత్ర ప్రతిష్ఠ, 27వ తేదీన మధ్యాహ్నం 12 గంటల నుండి 1 గంట వరకు పవిత్ర సమర్పణ, 28వ తేదీన సాయంత్రం 6 గ.ల నుండి 8 గం.ల వరకు పూర్ణాహుతి నిర్వహించనున్నామని తెలిపారు.

శివాలయాల్లో శివ నామస్మరణ

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామివారి అనుబంధ దేవాలయాలు, క్షేత్ర పాలకులు అయిన పంచాయతన కాశీ విశ్వేశ్వర, బాల త్రిపురాంతక ఆలయాలు కార్తీక మూడవ సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా మహిళా భక్తులు వేకువజామున నుంచి గంటల కొద్ది క్యూలో నిల్చుని శివాలయాల్లో అభిషేకాలు, అర్చనలు చేసుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు ఆదేశాల మేరకు అధికారులు ఆలయాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

శాసనసభ ప్రాంగణంలో ప్రభుత విప్ ఛాంబర్ ప్రారంభం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు పెతకంశెట్టి గణబాబు సోమవారం శాసనసభ ప్రాంగణంలో తన ప్రభుత విప్ ఛాంబర్‌ను అధికారికంగా ప్రారంభించారు. ముందుగా పూజలు నిర్వహించి ఛాంబర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు గణబాబుకు మిఠాయిలు తినిపించి అభినందనలు తెలియజేశారు.

పార్వతీ పరమేశ్వరుల సేవలో అవంతి

విశాలాంధ్ర - తగరపువలస: పవిత్ర కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణ మధ్య నియోజకవర్గంలో సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని, పార్వతి పరమేశ్వరుల పూజా లింగాష్ట అభిషేక కార్యక్రమం మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

కురపల్లిలో భారీ అన్న సంతర్పణ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ కురపల్లి గ్రామంలో పురాతన దేవాలయం శ్రీ రామచంద్ర రామలింగేశ్వర ఆలయంలో కార్తీక మాసం మూడవ సోమవారం పురస్కరించుకొని భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. గత కొన్నేళ్లగా ప్రతి ఏడాది కార్తీక మాసంలో మూడవ సోమవారం శివాలయం వద్ద అన్న సంతర్పణ నిర్వహిస్తూ వస్తున్నారు. సోమవారం నిర్వహించిన భారీ అన్న సంతర్పణకు సుమారు 3000 మంది హాజరైనట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శివాలయం సేవా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకూడదు: కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్"లో వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు. "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" కార్యక్రమం సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను సావధానంగా వింటూ, వారి అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి విచ్చేసిన అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సోమ వారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో వివిధ సమ స్యలపై మొత్తం 328 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 149 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 19, జీవీఎంసీకి సంబంధించి 53, ఉన్నాయి. ఇతర విభాగాలకు సంబంధించి 107 వినతులు వచ్చాయి. కార్య క్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జిల్లా పరిషత్ సీఈఓ నారాయణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు పాల్గొన్నారు.

గిరిజన రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

- అన్ని నగరాల్లో అరకు కాఫీ
- జీసీసీ చైర్మన్‌గా కిదారి శ్రావణ్ కుమార్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గిరిజన రైతులు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్మన్ కిదారి శ్రావణ్ కుమార్ అన్నారు. ఆయన ఈస్ట్ పాయింట్ కాలనీలో గల జీసీసీ కార్యాలయంలో సోమవారం చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఈ పదవి ఇచ్చిన తండ్రి నారా చంద్రబాబునాయుడుకి ధన్య వాదాలు తెలిపారు. అనివార్య కారణాల వల్ల మంత్రి రాలేకపోయారని, విశాఖ మన్యం అభి వృద్ధికి జీసీసీ తోడ్పాటు అందిస్తుందన్నారు. నిజాయితీ, నిబద్ధ తతో కట్టుబడి వున్నామని, సిఎం విజన్ అరకు కాఫీ ప్రపంచ దేశాలకు విస్తరణ చేయడమేనన్నారు. గిరిజన రైతులకు దళారులు లేకుండా వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని అన్నారు. పాత వాహనాలకు మరమ్మతులు, కొత్తవి కొనుగోలు, ఉద్యోగ కల్పన, పంట నష్టం లేకుండా చూస్తామన్నారు. సీతమ్మ పేట, కొమరాడ ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తామని, 22 సెక్యూరిటీ గార్డులకు పెండింగ్ వేతనాలు క్లియర్ చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత జీసీసీ ఆఫీసు స్థానంలో 16 అంతస్తులతో కొత్త భవనం నిర్మిస్తాం అన్నారు. అరకు కాఫీ అందరి అభిమానం పొందిందని, దేశంలోని అన్ని ప్రముఖ నగరాల్లో అరకు కాఫీ లభించేలా చూస్తాం అన్నారు. గొడౌన్లు వర్షాలకు కారి పోతున్నాయని ప్రశ్నించగా, మరమ్మతులు చేయిస్తామన్నారు. టీటీడీకి జీసీసీ సరకులు సరఫరా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జడ్పీ మాజీ చైర్ పర్సన్ వంజంగి కాంతమ్మ, జీసీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయ ప్రశాంతతను కాపాడండి

విశాలాంధ్ర - విశాఖపట్నం: అనవసర రాజకీయాలు స్వార్థ పరమైన ఆలోచనలతో విద్యాలయ ప్రశాంతతను భగ్నం చేయవద్దని ఏయూ పరిరక్షణ సమితి అధ్యక్షులు మల్లు మహేష్ కోరారు. సోమ వారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘాల పేరుతో అకారణంగా ధర్నాలు, రాస్తారోకోలు చేయడం పరిపాటైందని, డిప్యూటేషన్‌పై వచ్చిన డిగ్రీ కళాశాలల అధ్యాపకులను విశ్వవిద్యాలయం నుంచి సాగనంపాలనే డిమాండ్ న్యాయ పరమైనదేనని, ఈ డిమాండ్‌కు మా సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

ఏయూలో డిప్యూటేషన్‌పై వచ్చిన అధ్యాపకులను తొలగించాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం: అర్హత లేకుండా డిప్యూటేషన్‌పై విశ్వ విద్యాల యంలో కొనసాగుతున్న డిగ్రీ అధ్యాపకులను వారి మాతృ సంస్థలకు పంపించాలని ఏయూ మెయిన్ గేట్ దగ్గర అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆంధ్ర విశ్వవిద్యాలయ శాఖ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం విశ్వ విద్యాలయ రాష్ట్ర కన్వీనర్ జి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో నాణ్యమైన విద్య అందుతుందని ఎన్నో ఆశలతో విద్యార్థులు విశ్వవిద్యాలయంలో అడుగు పెడుతు న్నారని, అటువంటి విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీల నుంచి యూని వర్సిటీలోకి అక్రమంగా వచ్చినటువంటి, అర్హతలేని, డిగ్రీ కళాశాల అధ్యాపకులతో విద్యను బోధించడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం లేదన్నారు. డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పరిశోధనలు చేయించడానికి అనర్హులు అనే విషయాన్ని కూడా ప్రభుత్వాలు మరిచి, వారి స్వార్థం కోసం వారిని విశ్వ విద్యాలయంలో కొనసాగించడం దారుణం అని అన్నారు. పరిశోధనలకు నిలయాలుగా వుండవలసిన యూనివర్సిటీలు కూడా వీరి కారణంగా పరిశోధనలు సైతం నిలిచి పోయే పరిస్థితి ఉందన్నారు. అర్హత లేకపోయినా విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్న అధ్యాపకులు కొన్ని డిపార్టుమెంటులలో హెడ్‌లుగా కూడా కొనసాగు తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయ నాయకులు నరసింహ, కోటేశ్వరరావు, రఘు తేజ, శ్రీను, వెంకటేష్, శివ కుమార్, అయ్యప్ప, విజయ్, పవన్, వంశీ పాల్గొన్నారు.

బీజేపీ బూత్ స్థాయి కమిటీలను సిద్ధం చేయాలి

విశాలాంధ్ర - ఆనందపురం: బీజేపీ భీమిలి రూరల్ మండల సమావేశం తాళ్ళవలస గ్రామంలో సోమవారం ఏటుకూరి వెంకట చైతన్య వర్మ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆర్.ఓగా అధిష్టానం నియమించిన ఉప్పాడ అప్పారావు హాజరై గ్రామాల్లో సాధారణ -బూత్ కమిటీలు వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా ప్రధాని మోడి ప్రవేశ పెట్టిన వికసిత్ భారత్ లక్ష్యం ఎస్సీ, ఎస్టీలకు నైపుణ్యం, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి, ఆరోగ్యం విషయమై ఆయుష్మాన్ భారత్ సామాన్యులకు వరంగా పెట్టిన పథకాలు ప్రజలకు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి.పట్నాయక్, నాయకులు బొట్టు అప్పల నారాయణ, ఎమ్.జగదీశ్వరి, జి.రామ్ కుమార్, గురుబిల్లి శ్రీనివాసరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వసతులు కల్పించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జగనన్న కాలనీలో వసతులు కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల రమణ మాట్లాడుతూ గత ప్రభుత్వం పట్టణ ప్రాంతాలలో నివాసం ఉంటున్న ఇల్లు లేని పేదలను గుర్తించి ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ నారాయణ గజపతి రాజు పురం వద్ద 500 మందికి సెంటు భూమిలో ప్రభుత్వ ఇచ్చిన రుణ సదుపాయంతో మరికొంత సొమ్మును అప్పులు తీసుకొని గత 2 సంవత్సరం క్రితమే లబ్దిదారులు సుమారు 200 మంది ఆ స్థలాలలో సొంత గృహాలు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు అన్నారు. ఇక్కడ ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు మంచినీరు, కరెంటు రోడ్లు, నిర్మించుకున్న ఇళ్లకు విద్యుత్ సౌకర్యం వంటివి ఏవీ లేవన్నారు. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు బిసవు నూకరాజు, కే.రామకృష్ణ, కూర్మారావు, నాగరాజు భాగ్యలక్ష్మి, జానకి కుమారి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర - కొమ్మాది: ఎండనక, వాననకా కష్టపడి పని చేస్తున్న కార్మికులను పస్తులు పెట్టడం అన్యాయమని సీఐటీయూ మధురవాడ జోన్ కమిటీ ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు అన్నారు. జీవీఎంసీలో ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, డైలి వేజ్ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. వెంటనే బకాయి పడ్డ 3 నెలల జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మధురవాడ జోన్ 2 కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించి జోనల్ కమిషనర్ పి.సింహాచలంకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జీతాలు సక్రమంగా ఏ నెలకు ఆ నెల ఇవ్వకపోతే ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి ఏంవి ప్రసాద్, సీటు ఆరిలోవ నాయకులు నరేంద్ర కుమార్, కార్యకర్తలు ఎస్.గౌరీ, జే.దేవి, ఎం.సురేష్, సిహెచ్ రాము, వై.సంతోషి, డి.లక్ష్మీనారాయణ, ఎం.నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో ఆవిష్కరణలపై సదస్సు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు, సంస్కరణలు, చేపట్టబోయే ప్రాజెక్టులు, అమలు చేస్తున్న పథకాలు, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలు అజెండాగా విశాఖపట్నం ర్యాడిసన్ బ్లూ హోటల్లో సోమవారం ఉదయం దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. భాగస్వామ్యమైన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి డా. దేవేశ్ చతుర్వేది, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, కేంద్ర వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ పెరిన్ దేవి, అడిషనల్ సెక్రెటరీలు మనిందర్ కౌర్ ద్వివేది, శౌభ థాకూర్, ప్రమోద్ కుమార్ మెహర్ధ, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, రాష్ట్రాల నుంచి, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి నుంచి వ్యవసాయ రంగ నిపుణులు, అధికారులు హాజరయ్యారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయి. విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు రాయడం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఎఫ్‌యుపి స్కూల్ ఎం.ఎస్.మహేశ్వరావు, ఇంగ్లీష్ మాస్టర్ సత్యనారాయణ, సోషల్ మాస్టర్ జీవీఎంసీ స్కూల్ అశోక్, మ్యాథ్స్ మాస్టర్, సోషల్ మాస్టర్ గ్రంథాలయాల అధికారి పాల్గొన్నారు.

ముగిసిన ఛాత్రోపాధ్యాయుల ద్వితీయ సంవత్సర ప్రయోగ పరీక్షలు

విశాలాంధ్ర - తగరపువలస: చాత్రోపాధ్యాయుల ద్వితీయ సంవత్సరపు ప్రయోగ పరీక్షలు ముగిసాయని డైట్ సీనియర్ అధ్యాపకుడు సీ.ఏ.సోమయాజులు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల సందర్శన సమయంలో తెలియజేశారు. స్థానిక ఒకటవ వార్డు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల బంగ్లామెట్టలో ఛాత్రోపాధ్యాయులకు నిర్వహించిన అంత్య ప్రయోగ పరీక్షల్లో బాహ్య, అంతర్గత పరిశీలకులుగా సీ.ఏ సోమయాజులు ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, ఈగల సంజీవి తదితరులు వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చాత్రో పాధ్యాయులు చక్కగా బోధించారని అభినందించారు. తదుపరి డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎన్నికై ఇదే మండలానికి రావాలని కోరారు. సోమయాజులు ఉపాధ్యాయుల డైరీలు, పాఠ్యప్రణాలు పరిశీలించి సంతృప్తి చేశారు.

నారా రామ్మూర్తి మృతి తీరని లోటు

విశాలాంధ్ర - భీమిలి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరులు, చంద్రగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి తీరని లోటని టి.డి.పి రాష్ట్ర కార్యదర్శి, 3వ వార్డ్ టి.డి.పి అధ్యక్షులు (భీమిలి డివిజన్) గంటా నూకరాజు అన్నారు. భీమిలి 3వ వార్డ్ టీ.డీ.పీ నాయకులు నారా రామ్మూర్తికి ఘన నివాళులర్పించారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆయన ఎనలేని సేవలు చేశారని, ప్రజల సంక్షేమానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిలి టీడీపీ నాయకులు మారోజు సంజీవ్ కుమార్, డెక్కన్ శ్రీను, రాజగిరి రమణ, పోలిరాజు, అప్పికొండ నర్సింగరావు, సత్తారపు చిన్న, కర్రీ శివ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

20కి పైగా జిల్లాల్లో యూజర్లకు వీఐ మెరుగైన నెట్‌వర్క్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తెలంగాణలోని 20కి పైగా జిల్లాల్లో తమ నెట్‌వర్క్‌ను గణనీయంగా మెరుగు పరచినట్లు దిగ్గజ టెలికాం ఆపరేటర్ వీఐ ప్రకటించింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, కర్నూలు, అనంతపురం, కడప, ఏలూరు, ఒంగోలు, నంద్యాల, ప్రొద్దుటూరు, భీమవరం, తెనాలి, మచిలీపట్నం, నరసరావుపేట, ఆదోని, తాడిపత్రి, హిందూపురం, గుంతకల్లు, గుడివాడ, ధర్మవరం, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి మొదలైన కీలక ప్రాంతాల్లో 3,450కి పైగా సైట్లలో సమర్థమంతమైన 900 ఎంహెచ్‌జెడ్ స్పెక్ట్రంను విజయవంతంగా వినియోగంలోకి తెచ్చిందని ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం వల్ల వీఐ వినియోగదారులు, ముఖ్యంగా పట్టణ ప్రాంతాలు అలాగే జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని వారు, మెరుగైన ఇండోర్ నెట్‌వర్క్ అనుభవాన్ని పొందగలుగుతారన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చి వేసిన రెవెన్యూ అధికారులు

నిర్మాణాలు జెసిబి సాయంతో నేలమట్టం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో శిర్లపాలెం పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 27 లో అక్రమంగా షెడ్ల నిర్మాణాన్ని తొలగించారు. సోమవారం మండల తహశీల్దార్ పేర్లి శ్యామ్ పసాద్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి, వీఆర్వో అప్పారావు ఆధ్వర్యంలో గ్రామానికి ఆనుకొని ఉన్న చెరువు ప్రక్కనే కొంతమంది రేకుల షెడ్లు, తాటి చెక్కలు సహాయంతో నిర్మాణాలు చేపట్టారని తాసిల్దార్ ఆదేశాల మేరకు తొలగించామని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా ఆక్రమణ కట్టడాలు చేపట్టినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భూ వినియోగ మార్పిడి దస్త్రాలను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలి



విశాలాంధ్ర - విశాఖ: భూ వినియోగ మార్పిడి కోసం వచ్చిన దస్త్రాలను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని వీఎంఆర్డీఏ ఎంసీ కెఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. ప్రణాళికా విభాగంపై సోమవారం నిర్వహించిన సమీక్షలోఆయన మాట్లాడుతూ న్యాయపరమైన కేసుల పెండెన్సీని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, ప్లానింగ్ అధికారులు వెంకటేశ్వర రావు, అరుణవల్లి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఈవో ఆకస్మిక పర్యటన

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో సోమవారం డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

మండలంలో కొనసాగుతున్న సర్వేలు ,శిక్షణ తరగతులు, పలు అంశాలపై సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా పలువురికి సలహాలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓతోపాటు ఎంపీడీవో జానకి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండల గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం ప్రాథమిక పాఠశాల పిల్లలకు స్టోరీ రైటింగ్, స్టోరీ టెల్లింగ్, చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్స్ పోటీలును గ్రంథాలయ అధికారి బి.వి.ఎస్ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు జయలక్ష్మి నియమించారు.

ఓపెన్ కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు

విశాలాంధ్ర - పద్మనాభం: విశాఖపట్నం జిల్లా ఎండాడ టిఎస్ఆర్ వేదికలో జరిగిన సౌత్ ఇండియన్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్లో ఆనందపురం గ్రామానికి చెందిన కుప్ప రేవంత్ కుమార్ (8) ఖాతా విభాగంలో సిల్వర్ మెడల్, కుమితీ విభాగంలో బ్రౌన్ మెడల్ సాధించారు. కక్కల నిఖిలేష్ కుమార్ (10) ఖాతా విభాగంలో బ్రౌన్ మెడల్ కుమితి విభాగంలో బ్రౌన్ మెడల్ సాధించడం జరిగింది. అనందపురం జెడ్పి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న షాడో షూట్ ఖాన్ కరాటే అకాడమీ కోచ్ ముగడ వెంకటరమణకు విజేతలైన విద్యార్థులకు వారి తల్లిదండ్రులు కుప్ప రాజశేఖర్, కుప్ప రామలక్ష్మి, కక్కల రమణమ్మ జై జవాన్ ఫౌండేషన్ తరపునుండి అభినందనలు తెలియజేశారు.

ఏఎంసీలో ప్రపంచ యాంటీ మైక్రోబియల్ అవగాహన వారోత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్ర వైద్య కళాశాలలో "ప్రపంచ యాంటీ మైక్రోబియల్ నిరోధకత అవగాహన వారోత్సవాల" ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. జి.బుచ్చిరాజు , కింగ్ జార్జ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పి. శివానంద, మైక్రో బయాలజీ విభాగపతి డా. పి. రత్నకుమారి పాల్గొని నీలిరంగు బెలూన్లు ఎగురవేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ మాట్లాడుతూ యాంటీ బయాటిక్, యాంటి ఫంగల్ మందులను డాక్టర్ల పర్యవేక్షణ లేకుండా వాడడం వలన యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ పెరుగుతోందని, దీని వలన భవిష్యత్తులో యాంటీబయాటిక్ మందుల కొరత ఏర్పడుతుందని, అందరూ కలసికట్టుగా ఈ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అనే మహమ్మారిని ఎదుర్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంతో వైస్ ప్రిన్సిపల్ డా రాజేంద్రపుసాప్, డా. శివ కళ్యాణి, ఏ ఎం ఆర్ నివారణ విభాగం నోడల్ ఆఫీసర్ డా. స్వప్న , వైద్య సిబ్బంది , వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండలానికి కలెక్టర్ రాక

విశాలాంధ్ర - ఆనందపురం: విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం ఆనందపురం మండలానికి వస్తున్నట్లు మండల ఎంపీడీవో జానకి తెలిపారు. ముందుగా ఉదయం 10 గంటలకి ఆనందపురం జిల్లా పరిషత్ హై స్కూల్ లో పాల్గొని అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎంపీడీవో తెలిపారు.

కొండవాలు ప్రాంతాలలో ఇంటి పన్నులు వేయండి

విశాలాంధ్ర - పీఎం పాలెం: కౌన్సిల్ సమావేశాల్లో అమలు అయినా ఉత్తర్వులు ఉన్న... ఆచరించడంలో జీవీఎంసీ జోన్-2 అధికారుల అలసత్వంపై కార్పొరేటర్ హేమలత అసహనాన్ని వ్యక్తం చేశారు. 5వ వార్డ్ పరిధిలో కొండవాలు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు త్రాగునీటి కొళాయి కనెక్షన్ నిమిత్తం ఇంటి పన్నులు వెయ్యాలని,ముఖ్యంగా వేసవి కాలంలో ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని వార్డ్ లో త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చేయాలని, కొండవాలు ప్రాంతాలైన అయ్యప్పనగర్, శారదనగర్, సాయిరాంకాలనీ,డ్రైవర్స్ కాలనీ,వికలాంగుల కాలనీ, ముత్యాలమ్మకాలనీ, గాంధీనగర్,శివశక్తినగర్ లలో త్రాగునీటి పైప్ లైన్లుకు సుమారు 5ఐదు కోట్లు రూపాయిలు వ్యయంతో పైప్ లైన్లు పనులు జరుగుతున్నాయని, కానీ కొండవాలు ప్రాంతాలలో నివాసాలకు ఇంటి పన్నులులేక మంచినీటి కొళాయి కనెక్షన్లు మంజూరు కావడం లేదని, వెంటనే కొండవాలు ప్రాంతాలలో మరియు గ్రామ కంతములు అయిన పరదేశి పాలెం, బోరవాణిపాలెం, మారికవలస, బొట్టవానిపాలెం, నగరంపాలెం లలో చాలా కాలం నుండి నివాసం ఉంటున్న ఇల్లుకు ఇంటి పన్నులు వేయాలని జీవీఎంసీ జోన్-2 కమిషనర్ పి.సింహాచలంకు కార్పొరేటర్ మొల్లి హేమలత వినతి పత్రాన్ని అందించారు.

ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డ వ్యక్తిని కాపాడిన పోలీసులు

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: ఫిషింగ్ హార్బర్ బీచ్ దగ్గర ఆత్మహత్యయత్నం చేసిన వ్యక్తిని కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళిత మన్యం జిల్లా గ్రామస్తుడైన ఒక వ్యక్తి, ఫిషింగ్ హార్బర్ బీచ్ దగ్గర ఆత్మహత్య చేసుకొనుటకు ప్రయత్నిస్తున్నాడనే సమాచారం మేరకు తక్షణం స్పందించిన 1 టౌన్ సి.ఐ జీ.డి. బాబు , ఫిషింగ్ హార్బర్ వద్దకు బీచ్ మొబైల్ హెచ్.సి ని, బ్లు కోల్ట్ పి.సీ ని పంపించి అతనిని కాపాడి పి.ఎస్‌కు తీసుకొని వచ్చి కౌన్సిలింగ్ ఇచ్చి, భోజన సదుపాయం చేసి, వారి బంధువులను పిలిపించి వారికి అప్పగించారు. ఈ సందర్భంగా బంధువులు సి.ఐ, వారి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

జీవీఎంసీకి వీపీఏ 10 కోట్ల ఆస్తి పన్ను చెల్లింపు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు చెల్లించవలసిన ఆస్తి పన్నును విశాఖపట్నం పోర్ట్ అథారిటీ 2024-25 ఆర్థిక సంవత్సరంనకు సంబంధించి 10 కోట్ల రూపాయల ఆస్తి పన్నును చెక్కు రూపంలో చెల్లించడమైనదని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు విశాఖపట్నం పోర్టు అథారిటీ 2024-25 ఆర్థిక సంవత్సరం నకు సంబంధించి చెల్లించిన 10 కోట్ల రూపాయల ఆస్తి పన్ను చెక్కును విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఫైనాన్స్ మేనేజర్ రమణమూర్తి నుండి అందుకున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్. సోమన్నారాయణ, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్.శ్రీనివాస్, జోనల్ కమిషనర్ రాము, రెవెన్యూ అధికారులను కమిషనర్ అభినందించారు. బకాయిల వసూళ్లపై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి జీవీఎంసీ ఆదాయ అభివృద్ధికి సహకరించేలా చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ సోమన్నారాయణకు, డిసిఆర్ ఎస్.శ్రీనివాస్ కు కమిషనర్ సూచించారు.



రక్షిత మంచినీరు సరఫరాకు ప్రణాళిక సిద్ధం చేయాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రతి ఇంటికి సురక్షిత మంచినీటి సరఫరా చేయడంతో పాటు పారిశుధ్య ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా నీరు, పారిశుధ్య మిషన్ కమిటీ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నీరు మరియు పారిశుధ్య మిషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సురక్షిత మంచినీటిని సరఫరా చేయడంతో పాటు పారిశుధ్య ప్రణాళికలు, అమలు చేయడం, కమ్యూనిటీ టాయిలెట్లు, అంగన్వాడీ కేంద్రాల్లో, పాఠశాలలో టాయిలెట్లు, పి.హెచ్.సి., సిహెచ్.సి.లలో టాయిలెట్లు, మంచి నీటి సరఫరా తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో కమ్యూనిటీ టాయిలెట్లు పరిశుభ్రతలో బెస్ట్ మొదటి మూడు పంచాయతీలకు నగదు బహుమతి ప్రకటించాలన్నారు. నవంబరు 19 నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు గ్రామ స్థాయి సమావేశాలు నిర్వహించి గ్రామంలో వున్న అవసరాలపై యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలి అన్నారు. గ్రామస్థాయి యాక్షన్ ప్లాన్ ఆధారంగా జిల్లా స్థాయిలో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్, డ్రామా పీడీ పూర్ణిమ దేవి, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తీరాన్ని కబ్జా చేసి హోటళ్లు నిర్మించిన వారిపై చర్యలేవి

మత్స్యకార నాయకుడు గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి: సముద్ర తీరప్రాంత ఉనికిని దెబ్బతీస్తూ కబ్జాదారుల కబంధ హస్తాల్లో నలిగిపోతున్న మత్స్యకారుల జీవితాలను కకావికలం చేస్తున్న వారిపై చర్యలకు ఎందుకు వెనుకాడుతున్నారని గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు, మత్స్యకారుల నాయకుడు గంటా నూకరాజు ప్రశ్నించారు. విశాఖ జిల్లా మత్స్యకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భీమునిపట్నం ఆర్డీవోకి వినతి పత్రం అందించారు. భీమిలి జోనల్ కార్యాలయం వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్ష ఐదవ రోజుకు చేరుకుంది. తీరంలో ఇంత బరితెగింపు జరుగుతున్నా.. మత్స్యకారుల మనోభావాలను దెబ్బతీస్తున్నా ఎందుకు వారిపై చర్యలకు వెనకాడుతున్నారని అడిగారు. ఈరోజు శిభిరంలో చేపలు ఉప్పాడ గ్రామ పెద్దలు కారి అప్పారావు, వాసపిల్లి గరగయ్య, మైలపల్లి నూకరాజు మైలపల్లి రాము గ్రామ పెద్దలు తోటవీధి పెద్దలు సూరడా పరిదేశీ నొల్లి చిన్నరమణ, బోయవీధి వాడమోదుల వీరన్న, వాడమోదుల తౌడయ్య, పాసి త్రినాధ్ కుమార్, రాములాప్పుడు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి సేవా సంఘం గౌరవ అధ్యక్షులు పిసి అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు, కోశాధికారి బర్రి కొండబాబు, గ్రామ పెద్దలు వాసుపల్లి గరగయ్య, వాసుపల్లి నర్సింగరావు, పుక్కళ్ళ ఎల్లారావు, వాసుపల్లి దాసు, కారి చిన్నారావు, బుడ్డా శ్రీనివాసరావు, నక్కా రవి, పిరిపిల్లి రమేష్, అల్లిపిల్లి శ్రీనివాస్, అశోక్, దూడ నూకరాజు, గంటా ఎల్లజీరావు, అల్లిపిల్లి గురువులు, అప్పన్న, చంద్రమోహన్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

జీవీఎంసీ టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా సోమవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయ అధికారిణి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీ.వీ.ఎం.సీ ఫ్లోర్ లీడర్, 96 వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు హాజరై పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుస్తక ప్రదర్శనలో వివిధ అంశములకు చెందిన సాహిత్యము, ప్రముఖుల జీవిత చరిత్రలు, చిన్నపిల్లల పుస్తకాలు, నవలలు, భక్తి పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు, రిఫరెన్స్ బుక్స్, దాతలు బహుకరించిన బుక్స్ ను ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయం జ్ఞాన సంపద గని అని, గ్రంథాలయంలో గల పుస్తకాలను పోటీ పరీక్షల విద్యార్థులు,స్కూల్ విద్యార్థులు స్థానికులు, మహిళలు అందరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో పుస్తక దాత బలివాడ కృష్ణప్రియ ను కార్పొరేటర్ పీల శ్రీనివాసరావు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ పథకం శెట్టి భూలోక రావు, కార్యదర్శి అదారి రామకృష్ణ, కోశాధికారి పెంటకోట గణేష్, పుస్తకధాత బలివాడ కృష్ణప్రియ సోషల్ సర్వీస్ లక్ష్మీ తేజ, పోటీ పరీక్షల విద్యార్థులు లిటిల్ ఫ్లవర్ స్కూల్, ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం మహిళా దినోత్సవ కార్యక్రమం, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

ఓబిసి క్రిమిలేయర్‌లో వేతనం లెక్కించరాదు

రాష్ట్ర ఓబీసీ డిపార్ట్మెంట్ ఇన్‌చార్జ్ మూల వెంకటరావు

విశాలాంధ్ర - పెందుర్తి: ఓబీసీ నాన్ క్రిమిలేయర్ పరిమితి 8 నుంచి 15 లక్షలకు పెంచాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర ఓబీసీ డిపార్ట్మెంట్ ఇంచార్జ్ మూల వెంకటరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సివిల్ ఎగ్జామ్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఓబీసీ క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయడంలో వారి తల్లిదండ్రుల వేతనాన్ని పరిగణలోకి తీసుకోవద్దని ఆయన కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఓబిసి వర్గం పిల్లల విషయంలో వారి తల్లిదండ్రుల ఆదాయాన్ని బట్టి క్రిమిలేయర్ నిర్ణయిస్తారని, ఆదాయం 8 లక్షల మించితే వారి పిల్లలకు రిజర్వేషన్లు వర్తించవని పేర్కొన్నారు. ఇదే విధానాన్ని ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు కూడా వర్తింపజేయాలని, కేంద్ర ప్రభుత్వం వేతన ప్రమాణాన్ని వర్తింపజేసే ప్రాతిపదికను విరమించుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఓబిసి క్యాటగిరి సిబ్బందికి వేతనం,వ్యవసాయం ద్వారా వారికి లభించే లాభాలను ఆదా యంగా పరిగణించరాదని, 1993 ఆఫీస్ మెమోరాండంలో ఈ విషయం స్పష్టంగా ఉందని, దానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఈ కారణంగా అనేకమంది ఓబీసీ అభ్యర్థులు గ్రూప్ ఏ,బి,సి,డి పోస్టులకు అనర్హులవుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విచక్షణతో ఆలోచించి ఓబీసీలకు మేలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని మూల వెంకటరావు విజ్ఞప్తి చేశారు.

భక్తులతో శివాలయాలు కిటకిట.. సందడిగా గుడిలోవ రంగనాథ స్వామి దేవాలయం

విశాలాంధ్ర - ఆనందపురం: కార్తీక మాసం మూడవ సోమవారం పురస్కరించుకొని శివాలయాలు, దేవాలయాలు భక్తులతో రద్దీ వాతావరణం నెలకొంది. గుడిలోవ శ్రీ రంగనాథ స్వామి దేవాలయం నందు సోమవారం తెల్లవారుజాము నుంచి భక్తులు సందడి కోలాటం గా మారింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి తండోపతండాలుగా ఈ శివాలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు, అలాగే స్వామివారి పాదాలను ప్రవహిస్తున్న పాలదార, భక్తులు స్థానం ఆచరించే విధంగా వీలుగా ఉంటుంది అందువల్ల ఉదయాన్నే నేరుగా భక్తులు ఇక్కడికి వచ్చి స్థానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి సన్నద్ధమవుతారు. అలాగే ఉదయం నుండి సుమారు 6 వేలు మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు కార్యనిర్వహణ అధికారి నానాజీ తెలిపారు. అలాగే భక్తులు సౌకర్యార్థం అనేక జాగ్రత్తలు తీసుకున్నామని ట్రాఫిక్కు ఇబ్బందులు లేకుండా పోలీస్ సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా తెలిపారు. అలాగే సోమవారం ఆలయం వద్ద ఏర్పాటుచేసిన మహా అన్నదాన కార్యానికి భక్తులతో విశేషమైన ఆదరణ లభించింది. సుమారు 5 వేలు మంది భక్తులు స్వామివారి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నదాన నిర్వాహకులకు మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామని, స్వామివారి దేవాలయంలో కార్తీకమాస సమయంలో అన్నదానం చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

ఆన్‌లైన్ మోసానికి వ్యతిరేకంగా మీషో ప్రాజెక్ట్ విశ్వాస్ పోరాటం

విశాలాంధ్ర/ విశాఖపట్నం: భారతదేశంలోని ఏకైక నిజమైన ఇ-కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన మీషో తన 'ట్రస్ట్ అస్యూరెన్స్ రిపోర్ట్' రెండవ ఎడిషన్‌ను ఆవిష్కరించింది. మీషో యొక్క చురుకైన చర్యలు, భద్రత వినియోగదారు విశ్వాసాన్ని పెంపొందించడానికి నిరంతర ప్రయత్నాలను నివేదిక పరిశీలిస్తుందన్నారు. సాంకేతిక ఆవిష్కరణలు, పరిశ్రమ నిపుణులతో సహకారం పటిష్టమైన భద్రతా చర్యలను అమలు చేయడం ద్వారా, మీషో తన వినియోగదారులకు సురక్షితమైన విశ్వసనీయమైన ఇ-కామర్స్ ప్లాట్ ఫారమ్‌గా పేరు తెచ్చుకుందన్నారు. ప్రాజెక్ట్ విశ్వాస్‌లో భాగంగా, ప్లాట్ ఫారమ్‌పై వినియోగదారుల నమ్మకాన్ని పెంపొందించడం నిర్వహించడంపై దృష్టి సారించిన తన అంకితమైన 'ట్రస్ట్ అండ్ సేఫ్టీ' బృందాన్ని బలోపేతం చేయడంలో కంపెనీ పెట్టుబడి పెట్టడం కొనసాగిస్తోందన్నారు. రిస్క్ ఇంటెలిజెన్స్ నిపుణులతో భాగస్వామ్యం చేయడం ద్వారా దాని సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా, ఈ డైనమిక్ ల్యాండ్‌స్కేప్‌లో భద్రతా ముప్పులను ముందుగానే ఎదుర్కోవడానికి కంపెనీ సిద్ధంగా ఉందన్నారు. గత 12 నెలల్లో, మీషో 2.2 కోట్ల మోసపూరిత లావాదేవీలను నిరోధించిందన్నారం అదనంగా, మీషో వేదిక నుండి చెడు నటులను తొలగించడానికి విస్తృతమైన చర్యలు చేపట్టింది. ఈ బృందం మార్గదర్శక విశ్లేషణాత్మక నమూనాలు, అధునాతన డేటా సైన్స్ ఫ్రేమ్‌వర్క్‌లు మరియు అధునాతన గణన తర్కాన్ని అభివృద్ధి చేసిందన్నారు. ఇది 13 లక్షల బాట్ ఆర్డర్‌లను నిరోధించడంలో సహాయపడి, ప్లాట్‌ఫారమ్‌ను యాక్సెస్ చేయకుండా 77 లక్షల స్కామ్ ప్రయత్నాలను నిరోధించిందన్నారు. జనరల్ మేనేజర్ సౌరభ్ పాండే మాట్లాడుతూ "మీషో వ్యూహంలో కీలకమైన భాగం 'ప్రాజెక్ట్ విశ్వాస్ అన్నారు.

పరిష్కారం దిశగా 5వ వార్డు కొండవాలు ప్రాంతాల సమస్యలు

విశాలాంధ్ర - పీఎం పాలెం: జీవీఎంసీ 5వ వార్డ్ కొండవాలు ప్రాంతాలైన సాయిరాం కాలనీలో మెట్ల మార్గాలు, రోడ్లు, కాలువలు పనులకు కార్పొరేటర్ మొల్లి హేమలత భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ చాల కాలంగా కొండవాలు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు మౌలిక వసతులు అయిన త్రాగునీరు, రోడ్లు, కాలువలు, వీధిలైట్లు మెట్లమార్గాలు లేక చాలా ఇబ్బందులు పడుతుండడం ప్రత్యక్షంగా చూశానని, వాటి పరిష్కారానికి గత ప్రభుత్వంలో చాలాసార్లు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాల్లో మేయర్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లానని, గత ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యంగా ప్రజా సమస్యలపైనే దృష్టి పెట్టిందన్నారు. శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు సహకారంతో ఐదవ వార్డ్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వార్డ్‌లో సమస్యలు అన్ని పరిష్కరించగలుగుతున్నానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి శ్రీను, మహిళా అధ్యక్షురాలు బోయి రమాదేవి, జనసేన అధ్యక్షుడు దేవర శివ,ఓలేటి శ్రావణ్, స్థానిక టిడిపి నాయకులు బొడ్డేపల్లి రంగారావు, కర్మోజు గోవిందరావు, ఆవాల నేలయ్య, వైకుంఠరావు, దుర్గారావు, నారాయణరావు, పాపారావు, జగన్నాథం, ఆదిలక్ష్మి, సన్యాసిరావు, జోగారావు, బొట్టా కోటి,మోహన్ పాల్గొన్నారు.